హైదరాబాద్
30-7-2023
సంపుటి:08
సంచిక: 329
పేజీలు: 4
వెల: రూ.5/-

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## బీజేపీ శాపం.. కాంగ్రెస్ పాపం..కేసీఆర్ దీపం: హరీశ్

- తెలంగాణ ద్రోహులు కిరణ్, చంద్రబాబు చుట్టూ తిరుగుతారా..?
- ఈ ప్రాంత ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటు

గజ్వేల్: ”తెలంగాణకు రూపాయి ఇయ్య.. ఏం చేసుకుంటావో చేసుకో అన్న కిరణ్‌కుమార్‌రెడ్డి ఇయ్యాల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి గురువు, ఉచిత కరెంట్ వద్దన్న చంద్రబాబు రేవంత్‌రెడ్డికి గురువు. దీపం లాంటి కేసీఆర్ ఉండగా.. తెలంగాణ ద్రోహుల చుట్టూ తిరుగుతున్న శాపం లాంటి బీజేపీ, పాపం లాంటి కాంగ్రెస్ మనకెందుకు..?” అని మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో హోంమంత్రి మహ మూద్ అలీతో కలిసి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతాంగం ఉసురుపోసుకున్న బీజేపీ, మూడు గంటలే కరెంటు చాలంటున్న కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అసెంబ్లీలో తెలంగాణకు నిధులివ్వరా? అని అప్పట్లో తాను ప్రశ్నిస్తే ఒక్క రూపాయి ఇయ్య...ఏం చేస్తారో చేసుకోండి అన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని కిషన్‌రెడ్డి తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సోయి మరిచి ముఖ్య అతిథిగా ఆహ్వానించారని మండిపడ్డారు. కిరణ్, బాబు కాళ్ల

మిగతా 2లో



# తగ్గుతున్న వరద

- ఎగువన గోదావరి, కృష్ణాల్లో ప్రవాహం తగ్గుముఖం
- గోదావరి నదిపై ఉన్న శ్రీరామ్‌సాగర్ గేట్లు మూసివేత
- ఎల్లంపల్లి, కాళేశ్వరం వద్ద తగ్గిన వరద ప్రవాహం
- భద్రాచలం, ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న ప్రమాద హెచ్చరికలు
- కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద తగ్గిన వరద
- శ్రీశైలం ప్రాజెక్టులోకి స్థిరంగా కొనసాగుతున్న ప్రవాహం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1,06,370 క్యూసెక్కులు కడలిలోకి..

అమరావతి/ధవళేశ్వరం/శ్రీశైలం ప్రాజెక్ట్: పరీవాహక ప్రాంతంలో వర్షాలు ఆగిపోవడంతో గోదావరి, కృష్ణా నదుల్లో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో ఎగువ గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. తెలంగాణలోని గోదావరి నదిపై ఉన్నశ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసేశారు. గోదావరి వరద ప్రవాహం ఎల్లంపల్లి, కాళేశ్వరం వద్ద తగ్గింది.ఎగువన వరద తగ్గిన నేపథ్యంలో.. ఆదివారం రాత్రి నుంచి భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద వరద ఉధృతి క్రమంగా తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద శనివారం

మిగతా 2లో



2లో

## జగన్‌కు ‘విధ్వంస’ జబ్బు

- అన్ని రంగాలనూ దెబ్బతీశారు: లోకేశ్
- ఆయనకు ఎక్స్‌ప్లోజివ్ డిజార్డర్
- టీడీపీ వచ్చాక ఒక్కో జిల్లాలో ఒక్కో రంగాన్ని అభివృద్ధి చేస్తాం
- నిర్ణయాల్లో నిపుణులకూ భాగస్వామ్యం
- వారిని రాజకీయాల్లోనూ ప్రోత్సహిస్తాం
- విశాఖను ఐటీ రాజధానిని చేస్తాం
- పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు
- యువగళం పాదయాత్రలో లోకేశ్

ఒంగోలు/బాపట్ల: ముఖ్యమంత్రి జగన్‌కు ఐఈడీ (ఇంటర్మిటెంట్ ఎక్స్‌ప్లోజివ్ డిజార్డర్) ఉందని, ఈ జబ్బు లక్షణం విధ్వంసమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ విధ్వంసం చివరకు అన్నిరంగాలను దెబ్బతీసిందన్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో నిపుణులను



## ప్రజలతో మూడు ముక్కలాట ఆడుతున్నారు

- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలది ముక్కోణపు ప్రేమకథ: కిషన్‌రెడ్డి
- బీజేపీ.. బీఆర్ఎస్‌తో ఎప్పటికీ కలవదని స్పష్టీకరణ
- బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి
- త్వరలోనే కేసీఆర్ కుటుంబం నుంచి తెలంగాణకు విముక్తి: తరుణ్ ఛుగ్



## బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం
- కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం
- ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ కొనసాగింపు
- కార్యదర్శిగా సత్యకుమార్‌కు మరోసారి అవకాశం
- పార్టీ నూతన పదాధికారులను నియమించిన జేపీ నడ్డా

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ కమిటీలో చోటు కల్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో బండి సంజయ్‌ను ఏదైనా ఒక రాష్ట్రానికి పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉంది. అదే సమయంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నాయకురాలు డీకే అరుణను పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగించారు.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వై.సత్యకుమార్‌కు జాతీయ కార్యదర్శిగా మరోసారి అవకాశం కల్పించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

మిగతా 2లో

## ఆవేదన వినటానికే వచ్చాం!

- మణిపూర్‌లో విపక్ష ఎంపీలు.. బాధితుల శిబిరాల సందర్శన
- ఇదంతా ప్రచారం కోసమే: కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్
- మైతేయిలతో కలిసి ఉండలేం.. మాకు విడిగా పాలన కావాలి
- ‘ఇండియా’ మద్దతు కోరుతూ గిరిజన నేతల లేఖ
- మణిపూర్‌ను విభజించవద్దంటూ రాజధానిలో భారీ ర్యాలీ

మిగతా 2లో

## దారెక్కడ.. దేవుడా!?

- కాలు కదపాలన్నా.. కారు కదలాలన్నా ‘దారి’.. తెన్నూ లేదు
- అడుగుకో గుంత.. ప్రమాద స్థితిలోకి బ్రిడ్జిలు, కల్వర్టులు
- అమ్మో.. అంతర్రాష్ట్ర రహదారి
- రోడ్లను గాలికొదిలేసిన సర్కారు
- నిర్వహణకు నోచుకోని
- 29,631 కి.మీ. ఆర్అండ్‌బీ రోడ్లు

మిగతా 2లో

## సాంపాదకీయం

# పచ్చని మాగాణం.. తెలంగాణ సాహిత్యం!

ప్రపంచంలో కెల్లా భారతదేశం విశిష్టమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్నట్టే భారతదేశంలో తెలంగాణ రాష్ట్రం విశిష్టమైంది. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రం వైవిధ్యభరిత సంస్కృతి, సాహిత్యంలోనూ విశిష్టతలు కనపడుతాయి. మరోమాటలో చెప్పాలంటే, భారతమాత కీర్తి కిరీటంలో కలికితురాయి తెలంగాణ తల్లి. రవి అస్తమించని వలస సామ్రాజ్యపు బంధనాల నుంచి విముక్తి సాధించిన భరతమాత కీర్తి కిరీటంలో అంతర్గత వలస బంధనాలను తెంచుకొని, గెలిచి, తలెత్తుకొని నిలిచిన కలికితురాయిగా వెలిసింది తెలంగాణరాష్ట్రం. ఆరు దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న రాష్ట్రమిది. తెలంగాణకు జరిగిన అవమానాలు, దోపిడీ గాయాలు ఇంకా పూర్తిగా మానలేదు. దాయబడి న, కనుమరుగైన తన అస్తిత్వం కోసం ఇంకా పెనుగులాడుతూనే ఉన్నది. వివక్షకు వక్రీకరణకూ గురైన తన చరిత్రను, సాహిత్యాన్ని, కవులను, కవయిత్రులను, సరిహద్దులను, సంస్కృతీ సంప్రదాయాలను, సంబురాలను, దేవీదేవతలను సహితం దేవులాడి భద్రప రుచుకునే పనిల వద్దది తెలంగాణ. మాయమై రూపుమారిన చరిత్ర కావ్యాలను, పత్రికలను, గ్రంథాలను దేవులాడుకొని అదిమిపట్టి, తన పొత్తిళ్ల బిడ్డని చేసి సంరక్షణ చేసుకుంటున్నది. అట్ల తన దక్కన్ తెహజీబ్ చరిత్రను సగౌరవంగా ప్రకటించుకుంటున్నది. ఆ క్రమంలోనే తాత్వికులను. దార్శనికులను, పద్యకవులను అన్వేషిస్తున్నది. చరిత్ర గనుల్లో తవ్వి దేవులాడిన ప్రాన్నయ యుగపు గుణాఢ్యుడిని, హాలుడు, శాతవాహనులను తన వారేనని ఆత్మీయంగా అలుముకొన్నది. సాధికారికంగా ప్రకటించుకున్నది తెలంగాణ. గొప్ప తాత్వికుడు, తెలంగాణ వేమనగా పిలుచుకోదగిన తత్వా ల దాసు, దున్న ఇద్దాసు నుంచి గోలకొండ కవుల సంకలన రూపశిల్పి సురవరం ప్రతాపరెడ్డి దాకా తెలంగాణ సాహిత్య ఎవుసపు జెండానెగరేసింది. నల్లని ఆకాశంలోకూడా పోరాడే భాస్కరులను ఆవిష్కరించిన కవిసింహం దాశరథి

# ఆవేదన వినటానికే వచ్చాం!

ఇంఫాల్/ న్యూఢిల్లీ, జూలై 29: మూడు నెలలుగా హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్ లో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు ప్రతిపక్షాల కు చెందిన 21 మంది ఎంపీల బృందం శనివారం రాష్ట్ర రాజధాని ఇంఫాలకు చేరుకుంది. తాజాగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న చురాచంద్‌పూంను తొలిరోజున ఎంపీలు సందర్శించారు. రెండు శిబిరాల్లో ఉన్న కుకీ బాధితులను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ, 'తమపై జరిగిన దారుణ అకృత్యాలను బాధితులు మాకు తెలియజేశారు. వీటన్నింటినీ పార్లమెంటులో లేవనెత్తుతాం' అని తెలిపారు. బిష్ణుపూర్, ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లో కుకీ బాధితులున్న శిబిరాలను కూడా ఎంపీలు సందర్శించారు. విపక్ష ఎంపీల మణిపూర్ పర్యటన ప్రచారం కోసమేనని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్(%ూఅబతీఖుస్త్ర ఎష్ణుఎబతీ%) విమర్శించారు. మరోవైపు, మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చి రాష్ట్రంలో నివాసం ఉంటున్న కాందిశీకుల బయోమెట్రిక్ వివరాలను సేకరించటం ప్రారంభించామని రాష్ట్ర ప్రభుత్వం శనివారం వెల్లడించింది. సెప్టెంబర్ నెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.



### వారి మృతదేహాలనైనా చూపించండి

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టింది. రాష్ట్ర పోలీసులు ఇప్పటికే ఈ ఘటనపై కేసు నమోదు చేయగా, ఆ ఎఫ్ఐఆర్‌ను సీబీఐ తీసుకుంది. ఇద్దరు బాధిత మహిళల్లో ఒక మహిళ తల్లిని ఎంపీలు సుస్మితాదేవ్, కనిమొళి కలిసి మాట్లాడారు. తన బిడ్డను దారుణంగా అవమానించి ఆమెపై అత్యాచారం జరిపారని, తన భర్తను, కుమారుడిని చంపేశారని, ఇదంతా పోలీసుల ముందే జరిగిందని ఆమె వాపోయారు. కనీసం వారి మృతదేహాలనైనా చూపించటంలో సహాయం చేయమని అర్థించారు. ఆమె భర్త సైన్యంలో పని చేసి దేశాన్ని రక్షించారుగానీ, తన ప్రాణాల్ని, తన కుటుంబాన్ని కాపాడుకోలేకపోయారని కనిమొళి ఆవేదన వ్యక్తం చేశారు.

### మా డిమాండ్లకు మద్దతివ్వండి

ఎంపీల పర్యటన నేపథ్యంలో మణిపూర్‌కు చెందిన 'మూలవాసీ గిరిజన నేతల ఫోరం' (ఐటీఎల్ఎఫ్) విపక్ష కూటమి 'ఇండియా'ను ఉద్దేశించి ఒక లేఖ రాసింది. హింసాకాండలో ఇరువర్గాలూ ప్రభావితమైనప్పటికీ, మూడింట రెండొంతుల మేర నష్టపోయింది తామేనని లేఖలో వారు తెలిపారు. ఇప్పటి వరకూ 119 మంది మరణించారని వీరిలో అత్యధికులు సాధారణ పౌరులేనని, 359 చర్చిలను, ఏడు వేలకుపైగా ఇళ్లను మైతేయీలు కాల్చివేశారని, 40 వేల మందికిపైగా గిరిజనులు స్వస్థలాల నుంచి దూరమయ్యారని పేర్కొన్నారు. మైతేయీలు, గిరిజనులు భౌతికంగా పూర్తిగా దూరమైన ఈ తరుణంలో మైతేయీల ఆధిపత్యంలోని మణిపూర్ ప్రభుత్వం కింద తాము ఉండటం సాధ్యం కాబోదని, తమ ప్రాంతాలకు ప్రత్యేక పాలనాయంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. ఈ డిమాండ్లకు ఇండియా మద్దతు తెలుపాలని కోరారు. మరోవైపు, గిరిజన తెగలకు ప్రత్యేక పాలన యంత్రాంగం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు వ్యతిరేకంగా ఇంఫాల్‌లో శనివారం భారీ ర్యాలీ జరిగింది. 'మణిపూర్ సమగ్రత సమన్వయ కమిటీ' ఆధ్వర్యంలో ఇది జరిగింది.

### సెప్టెంబరులో 'ఇండియా' మూడో భేటీ

ప్రతిపక్ష కూటమి 'ఇండియా' మూడో సమావేశం సెప్టెంబరు మొదటి వారానికి వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. ఈ భేటీ ఆగస్టు 25, 26 తేదీల్లో ముంబైలో జరుగుతుందని భావించారు.

# దారెక్కడ.. దేవుడా!?

(మొదటి పేజీ తరువాయి)

ఇదేం పాలనంటూ జనం ఛీత్కరించుకుంటున్నారు. పరిస్థితి ఇంతలా దిగజారి ఉంటే.. "దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అద్భుతమైన రహదారుల ని ర్మాణం. జగనన్న మాటిచ్చారు.. అత్యాధునికమైన టెక్నాలజీతో రోడ్లు నిర్మించారు. ఇంత అందమైన రోడ్లు మరెక్కడైనా ఉన్నాయా".. కలర్‌ఫుల్ గ్రాఫిక్స్‌తో కూడిన ఫొటోలు గత కొద్దిరోజులుగా సోషల్ మీడియా లో తెగ వైరలవుతున్నాయి. అవన్నీ ఏపీలో ఉన్న అందమైన అద్దంలా మెరిసే రోడ్లంటూ వైసీపీ సోషల్ మీడియా , వారి అనుకూలురు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు. ఇంతకీ జగన్ అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ఎన్ని కిలోమీటర్ల రహదారులు బాగుపడ్డా యో తెలిస్తే.. అవాక్కవ్వాల్సిందే! జూన్ మొదటి వారం నాటికే సర్కారు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 8వేల కిలోమీటర్ల రాష్ట్ర ప్రధాన రోడ్లు(స్టేట్ రోడ్స్ ), జిల్లా ప్రధాన రోడ్లు(ఎండీఆర్), గ్రామీణ రోడ్ల నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టాలి. ఆర్అండ్‌బీ నియంత్రణలో 45, 317 కిలోమీటర్ల రహదారులు ఉంటే, అం దులో స్టేట్ రోడ్లు 12,592 కిమీ, జిల్లా ప్రధాన రహదారులు 32,725 ఉన్నాయి. కేం ద్రం నిర్వహణలోని జాతీయ రహదారులు 8,613 కిమీ ఉన్నాయి. ప్రభుత్వం తన నిధులతో ఏటా 8వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్వహణ చేపట్టాలి. పాడైన బ్రిడ్జిలను బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలి. ఇందుకోసం ఏటా రూ.2500 కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉంది. దీంతోపాటు కేంద్రం నుంచి సీఆర్ఎఫ్, నాబార్డు...గ్రామీణ రహదారులు. తదితర పద్దుల కింద నిధులు ఇస్తున్నాయి. అయితే, గత నాలుగేళ్లుగా జగన్ సర్కారు రహదారులకు ప్రాధాన్యతేఇవ్వడం లేదు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' అనేక వార్తలను ప్రచురించింది. గాలికి వదిలేశారు.. నిబంధనల ప్రకారం, ఏటా 8వేల కిలోమీటర్ల చొప్పున నాలుగేళ్లలో 32వేల కిలోమీటర్ల రహదారుల నిర్వహణను సర్కారు పూర్తిచేయాల్సిఉంది. కానీ కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాష్ట్రం తన వాటాగా కేటాయించిన నిధులను పక్కదారి మళ్లించి, రోడ్లను గాలికొదిలేసింది. ఫలితం రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రాజకీయపక్షాలు, సామాన్యుల ఆందోళనలతో ఏపీ రోడ్లు అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయి. ఇక పరువు పోయిందని భావించిన ప్రభుత్వం 2021లో బ్యాంక్ బరోడా నుంచి 2200 కోట్ల అప్పు తీసుకొచ్చి 7900 కిలోమీటర్ల వర్క్‌లు చేపడతామని హడావుడి చేసింది. 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఆ వర్క్‌లు పూర్తిచేస్తామని గొప్పలు చెప్పింది. కానీ, అందులో 2369 కిలోమీటర్ల పరిధిలోనే వర్క్‌లు చేసింది. వీటిల్లో సింహభాగం ఐప్యాక్ సిఫారసు చేసినవే ఉన్నా యి. ఇందులోనూ సగం వర్క్‌లు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

# జగన్‌కు 'విధ్వంస' జబ్బు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం చేస్తామని, రాష్ట్రంలో ఒక్కో జిల్లాలో ఒక్కో రంగాన్ని అభివృద్ధి చేసి ఉద్యోగాల కోసం ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లకుండా చూస్తామన్నారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే పరిశ్రమదారులకు ఎక్కువ రాయల్టీలు ఇవ్వటం తమ పాలసీ అని ప్రకటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా గుండ్లాపల్లి వద్ద ఆయన బస చేసిన క్యాంపులో శనివారం వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ముఖాముఖి నిర్వహించారు. దేశంలో వివిధ రంగాల్లో ఉన్న పలువురు నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని పలు అంశాలను, సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా లోకేశ్ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, ఆయా రంగాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీస్తున్న తీరునువివరిస్తూ, భవిష్యత్తులో టీడీపీ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టబోతుందో వివరించారు. "వివిధ రంగాల్లోని నిపుణులను రాజకీయాల్లోనూ ప్రోత్సహించాలనేది టీడీపీ లక్ష్యం. తద్వారా సమాజానికి మెరుగైన సేవ చేసే అవకాశం లభిస్తుంది. ఆ లక్ష్యంతోనే సింగపూర్‌లో ఐటీ కంపెనీ నిర్వహిస్తున్న తణుకు వాసి రాధాకృష్ణను చంద్రబాబు నాయుడు ప్రోత్సహించి రాజకీయాల్లో తెచ్చి ఎమ్మెల్యేను చేశారు. రానున్న రోజుల్లో నిపుణులు రాష్ట్రాన్ని వదిలి వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. కేజీ నుంచి పీజీ వరకు విద్యను కూడా ప్రక్షాళన చేసి, తద్వారా జాబ్ రెడీ యూత్‌ను రాష్ట్రంలో సిద్ధం చేస్తాం. ఎన్నో కంపెనీలు ఇప్పుడు వర్క్ ఫ్రమ్ హోంతో ముందుకు వెళ్తున్నాయి. ఆ అవసరాన్ని ముందుగానే గుర్తించి ఫైబర్ గ్రిడ్ ప?థకాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ప్రస్తుత అవసరాలకు అణుగుణంగా టీడీపీ అధికారంలోకి రాగానే ఫైబర్ గ్రిడ్ ద్వారా మెరుగైన ఇంటర్‌నెట్ సేవలందిస్తాం.

# ప్రజలతో మూడు ముక్కలాట ఆడుతున్నారు

న్యూఢిల్లీ: బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలది ముక్కోణపు ప్రేమకథ అని... ఈ మూడు పార్టీలూ కలిసి తెలంగాణ ప్రజల జీవితాలతో మూడు ముక్కలాట ఆడుతున్నా యని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో ఆ మూడు పార్టీలు నాటకాలు ఆడు తూ అనేక రకాలుగా తప్పుడు ప్రచారం చేస్తు న్నాయని విమర్శించారు.తెలంగాణలో ఎన్ని కలకు ముందు లేదా తర్వాత కలిసి ప్రయాణం చేసే ఈ మూడు పార్టీల మధ్య ముక్కోణపు ప్రేమ కథ నడుస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలకు ఆయా పార్టీల అసలు స్వరూ పం తెలిసిపోయిందని, అందుకే బీజేపీకి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ (మల్కాజ్‌గిరి), నేతలు జైపాల్ రెడ్డి (జహీరాబాద్), లక్ష్మారెడ్డి (రంగారెడ్డి) కాషా య కండువా కప్పుకున్నారు. కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ సమక్షంలో ఈ నలుగురు నాయకులకు పార్టీ సభ్యత్వ రశీదు అందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా పనిచేసిన వారు బీజేపీలో చేరారని... మరిన్ని చేరికలు ఉండేలా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళతామన్నారు.

ఏ రోజు కూడా బీజేపీ, బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయలేదని.. భవిష్యత్తులోనూ పనిచేయ బోదని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పార్టీని గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ పనిచే స్తుందన్నారు. కాగా జిట్టా బాలకృష్ణారెడ్డి ఇచ్చే సర్టిఫికెట్ తనకు అవసరం లేదని.. అతను చేసే ఆరోపణలపై జవాబు చెప్పాల్సిన అవసరం కూడా లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజే పీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ మాట్లాడుతూ, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్ళారని, అందుకే ఇప్పుడు తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల నమ్మకం పోయిందన్నారు. త్వరలోనే కేసీఆర్ కుటుంబం నుంచి తెలంగాణకు విముక్తి లభిస్తుందన్నారు.

బీజేపీ కండువా కప్పుకున్న అనంతరం మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి మాట్లాడుతూ, ఇన్నేళ్లలో కనీసం 50 సార్లు రాహుల్ గాంధీని కలిసినా... కనీసం తనను గుర్తుపట్టలే రన్నారు. రాజకీయ చైతన్యం లేని రాహుల్‌గాంధీలాంటి నేత నేతృత్వంలో ఎవరైనా ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బీజేపీలో ఉన్నారని... డూప్లికేట్లు, అన్ని పార్టీలు తిరిగొచ్చిన నేతలు, మిక్స్‌డ్ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని రంగారెడ్డి వ్యాఖ్యానించారు.

# తగ్గుతున్న వరద

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 6 గంటలకు 15,69,011 క్యూసెక్కులు వస్తుండటంతో అక్కడ నీటి మట్టం 55.6 అడుగులకు చేరుకుంది. దాంతో మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.భద్రాచలం నుంచి వస్తున్న వరదను వచ్చినట్టుగా పోలవరం ప్రాజెక్టు 48 గేట్లను పూర్తిగా ఎత్తేసి అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 14,80,862 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 7,100 క్యూసెక్కులను వదులుతూ మిగులు జలాలను 175 గేట్ల ద్వారా అధికారులు కడలిలోకి వదిలేస్తున్నారు. బ్యారేజ్‌లో నీటి మట్టం 15 అడుగుల వద్ద స్థిరంగా ఉండటంతో రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.

### శ్రీశైలం ప్రాజెక్టులోకి 1.51 లక్షల క్యూసెక్కులు

పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గడంతో కృష్ణా, తుంగభద్రలలో వరద తగ్గుముఖం పట్టింది. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లోకి వరద ప్రవాహం తగ్గింది. ఇక తుంగభద్ర డ్యామ్‌లోకి 84,202 క్యూసెక్కులు చేరుతుండగా నీటి నిల్వ 69.23 టీఎంసీలకు చేరుకుంది. మరో 36 టీఎంసీలు చేరితే తుంగభద్ర డ్యామ్ నిండుతుంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది.శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలంలోకి ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి 1,48,875, సుంకేశుల నుంచి 2,181 వెరసి 1,51,056 క్యూసెక్కులు చేరుతున్నాయి. దాంతో నీటి నిల్వ 837.9 అడుగుల్లో 58.81 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులు. పూర్తి నీటి నిల్వ 215.81 టీఎంసీలు. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 157 టీఎంసీలు అవసరం. తెలంగాణలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో మూసీలో వరద ప్రవాహం తగ్గింది. పులిచింతల ప్రాజెక్టులోకి 11,949 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 30.78 టీఎంసీలకు చేరుకుంది. మరో 15 టీఎంసీలు చేరితే పులిచింతల ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది. మున్నేరు, కట్టలేరు, బుడమేరులలో వరద తగ్గుతుండటంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి చేరుతున్న ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,06,370 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో వరదను 60 గేట్లు రెండు అడుగులు, పది గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు.

### సంగమేశ్వరుడిని చుట్టేస్తున్న కృష్ణమ్మ

కొత్తపల్లి (నంద్యాల): శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాుహం పెరగడంతో కొత్తపల్లి మండలంలోని సప్తనదీ సంగమేశ్వరాలయాన్ని కృష్ణాజలాలు చుట్టేస్తున్నాయి. ఆలయం జలాధివాసానికి చేరువలో ఉంది. ఈ నేపథ్యంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ దంపతులు శనివారం ఆలయంలోని వేపుదారు శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, నదిజలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేషపూజలు చేశారు. గంటగంటకు నీరు పెరుగుతుండటంతో శనివారం రాత్రి 9 గంటల సమయానికి గర్భాలయంలోకి నీరుచేరుతుందని పురోహితులు తెలిపారు.

# బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ కమిటీలో కీలక మార్పులు చేశారు. మొత్తం 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు, 9 మంది జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఒక జాతీయ సంస్థాగత వ్యవహారాల సహ ప్రధాన కార్యదర్శి, 13 మంది జాతీయ కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఒక సహ కోశాధికారితో కూడిన జాతీయ కమిటీని జేపీ నడ్డా నియమించగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఏపీ బీజేపీ వ్యవహారాల సహ ఇన్‌చార్జిగా ఉన్న సునీల్ దేవ్‌ధర్‌ను పార్టీ జాతీయ కార్యదర్శిగా తప్పించారు. కర్ణాటకకు చెందిన సీటీ రవి, అస్సాంకు చెందిన ఎంపీ దిలీప్ సైకియాలను ప్రధాన కార్యదర్శి హోదా నుంచి పక్కనబెట్టారు. అదేవిధంగా, కార్యదర్శులుగా ఉన్న యూపీ ఎంపీలు వినోద్ సోంకార్, హరీశ్ ద్వివేదిలు కూడా పార్టీ పదవులను పోగొట్టుకున్నారు. ఇంకా, పార్టీ ఉపాధ్యక్షులుగా మైనారిటీ వర్గం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించారు. వీరిలో ఒకరు కేరళకు చెందిన అబ్దుల్లా కుట్టీ, మరొకరు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, యూపీ బీజేపీ ఎమ్మెల్సీ మన్సూర్. కాగా, జాతీయ స్థాయిలో బీజేపీ విధానాలు, ఎజెండాకు కీలకంగా ఉన్న సీటీ రవికి ఉద్వాసన పలకడం వెనుక కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయమే కారణమన్న అభిప్రాయం ఉంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీటీ రవి కూడా మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు.

# బీజేపీ శాపం.. కాంగ్రెస్ పాపం..కేసీఆర్ దీపం: హరీశ్

(మొదటి పేజీ తరువాయి)

వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడతారా? తెలంగాణను రాచి రంపాన పెట్టి, ఈ ప్రాంతానికి కరెంట్, నీళ్లు ఇయ్యకపోగా.. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నేడు రేవంత్‌రెడ్డికి గురువు అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ ద్రోహులుగా ముద్రపడిన కిరణ్, చంద్రబాబు కాళ్ల దగ్గర ఈ ప్రాంత ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడతారా..? ఇది సిగ్గుచేటు అంటూ వ్యా ఖ్యానించారు. చంద్రబాటు ఇటీవల తెలంగాణపై ప్రేమ చూపినట్లు మాట్లాడు తున్నారని, అదీ ఏపీ సీఎం జగన్‌పై కోపంతో మాత్రమేనని, నిజంగా ఆయనకు తెలంగాణపై ప్రేమ లేదని, ముమ్మాటికీ ఆయన ఈ ప్రాంతానికి ద్రోహి అని పునరుద్ఘాటించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.



## పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి

**చేగుంట,సమ సమాజం:** పని చేసే ప్రభుత్వానికి అండగా ఉండి పార్టీని మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, తెలంగాణ ప్రభుత్వ హయాంలో దుబ్బాక నియోజక వర్గంలో అనేక అభివృద్ధి జరుగుతుందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేగుంటలో శనివారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. చేగుంట పట్టణంలోని మహంకాళమ్మ, భూలక్ష్మీ, మల్లన్న ఆలయాలను సందర్శించారు. వాసవీ కాన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును ప్రారంభించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని బుడగజంగాల కాలనీలో పర్యటించి సీసీ రోడ్లుకు సంబందించిన నివేదికలు తయారు చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల సేవలను గుర్తించి వారికి నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఎన్జీవోస్ కాలనీలోని 14వార్డులో రూ.15లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. పద్మశాలి సంఘం భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పర్యటనలో భాగంగా టైలర్ అసోసియేషన్‌తో కలిసి బట్టలు కుట్టి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని దేశంలోని ప్రజలు గర్వీహిస్తున్నారని, పేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. మండలకేంద్రంలోని సాయిబాలాజీ గార్డెన్‌లో చేగుంట పట్టణ సమస్యలపై సమీక్షించారు.

## సంక్షేమానికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి చేరికలు

**గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ బిలాల్**


**అబిడ్స్, సమ సమాజం:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీ లో చేరేందుకు దండిగా ముందుకు వస్తున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నంద కిషోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన 30 మంది బీఆర్ఎస్ పార్టీ లో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం, నందకిషోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారని తెలిపారు.
ఆయా పథకాలతో ప్రజలు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో పార్టీ పట్ల రోజు రోజుకు ఆదరణ పెరుగుతున్నదని, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు పాటు పడాలన్నారు. ఆనంద్‌సింగ్, బల్దీప్ సింగ్, రవి కుమార్ పాల్గొన్నారు.

## నిండు కుండల్లా.. చెరువులు సురక్షితం

**మేడ్చల్, సమ సమాజం:** రాష్ట్రం సిద్ధించి, మనదైన ప్రత్యేక పాలన రావడంతోనే తెలంగాణ ప్రాంత చెరువులకు మహర్దశ పట్టుకున్నది. పూడిపోయిన, నీళ్లు లేక బీళ్లుగా మారి పడావు పడ్డ చెరువులకు పూర్వ వైభవం తెచ్చేందుకు మన సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రణాళిక రచించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని, రేపటి అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక దృష్టి సారించి 'మిషన్ కాకతీయ'తో వాటికి మరమ్మతులు చేపట్టి, నీళ్లు నిలిచేలా అభివృద్ధి చర్యలు చేపట్టారు. దీని వల్లే చెరువుల్లో చేరిన నీటిని తట్టుకునేందుకు అవి దీటుగా మారి సాగుకు నీరందించేందుకు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి.
ఎడతెరిపి లేకుండా కురిసిన వానల వల్ల చెరువులు నిండగా అధికమైన నీరు అలుగుల ద్వారా వెళ్లిపోయింది. దీని ద్వారా చెరువులకు ఎలాంటి నష్టం జరగలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెరువుల అభివృద్ధికి మిషన్ కాకతీయ పథకం ద్వారా దశల వారీగా నిధులు కేటాయించి మరమ్మతులు చేసి చెరువులను బలంగా చేశారు. మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లాలో 489 చెరువులు ఉండగా, ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 కోట్ల నిధులతో దశల వారీగా అభివృద్ధి(మరమ్మతులు) చేస్తున్నారు. మిషన్ కాకతీయ పథకంలో చిన్న నీటి వనరుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం 20 శాతం చెరువుల అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ఆదేశాల మేరకు మరమ్మతులు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 230 చెరువులు అభివృద్ధి అయినట్లు అధికారులు వెల్లడించారు.

**జిల్లాలో ఆయకట్టు 25.136 ఎకరాలు**

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 489 చెరువుల ఆయకట్టు 25.136 ఎకరాల ఆయకట్టు ఉంది. 100 ఎకరాల పైన ఉన్న 50 చెరువులకు 16. 943 ఎకరాల ఆయకట్టు ఉండగా, 100 ఎకరాల లోపున్న చెరువులు 439 ఉండగా, 8.193 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకు కురిసిన వానలతో 305 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. మిగతా చెరువులు 85 శాతానికి పైగా నిండినట్లు అధికారులు పేర్కొన్నారు.



# శాంతి భద్రతలు నెలకొల్పాలి

**మణిపూర్‌లో అల్లర్లను అరికట్టి..**

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**




**కేపీహెచ్‌బీ సమ సమాజం:** మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి అమాయకులైన ప్రజల ప్రాణాలు తీస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మణిపూర్ ఘటనలపై నిరసిస్తూ కూకట్‌పల్లిలోని క్రిస్టియన్ సంఘాలు, పాస్టర్ల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.., కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలనలో తొమ్మిదేండ్లుగా కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విభేదాలు రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నదని మండపడ్డారు. దేశంలో సర్వమత ప్రజలు కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించేవారని, నేడు కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని పాలన సాగిస్తుండటం బాధాకరమన్నారు. మణిపూర్ రాష్ట్రంలో రెండు వర్గాల మధ్య గొడవను అడకట్టడంలో ప్రధాని మోదీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. క్రిస్టియన్ల చర్చిలను కూల్చడం, మహిళలను నగ్నంగా ఊరేగించడం బాధకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మణిపూర్ ఘటనపై స్పందిస్తూ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలతో నిరసన వ్యక్తం చేస్తూ మోదీపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించినట్లు తెలిపారు. మణిపూర్ ఘటనపై ప్రధాని మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని, అక్కడ జరుగుతున్న ఆగడాలను అరికట్టాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే దేశ ప్రజలే మోదీపై తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్ రావు, జూపల్లి సత్యనారాయణ, పండాల సతీశ్ గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు డేవిడ్, ఆయా ప్రాంతాలు క్రైస్తవ సంఘాల నేతలు, పాస్టర్లు ఉన్నారు.

# బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ కమిటీలో చోటు కల్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో బండి సంజయ్‌ను ఏదైనా ఒక రాష్ట్రానికి పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉంది. అదే సమయంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నాయకురాలు డీకే అరుణను పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వై.సత్యకుమార్‌కు జాతీయ కార్యదర్శిగా మరోసారి అవకాశం కల్పించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ కమిటీలో కీలక మార్పులు చేశారు. మొత్తం 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు, 9 మంది జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఒక జాతీయ సంస్థాగత వ్యవహారాల సహ ప్రధాన కార్యదర్శి, 13 మంది జాతీయ కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఒక సహ కోశాధికారితో కూడిన జాతీయ కమిటీని జేపీ నడ్డా నియమించగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఏపీ బీజేపీ వ్యవహారాల సహ ఇన్‌చార్జిగా ఉన్న సునీల్ దేవ్‌ధర్‌ను పార్టీ జాతీయ కార్యదర్శిగా తప్పించారు. కర్ణాటకకు చెందిన సీటీ రవి, అస్సాంకు చెందిన ఎంపీ దిలీప్ సైకియాలను ప్రధాన కార్యదర్శి హోదా నుంచి పక్కనబెట్టారు.
అదేవిధంగా, కార్యదర్శులుగా ఉన్న యూపీ ఎంపీలు వినోద్ సోంకార్, హరీశ్ ద్వివేదిలు కూడా పార్టీ పదవులను పోగొట్టుకున్నారు. ఇంకా, పార్టీ ఉపాధ్యక్షులుగా మైనారిటీ వర్గం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించారు. వీరిలో ఒకరు కేరళకు చెందిన అబ్దుల్లా కుట్టీ, మరొకరు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, యూపీ బీజేపీ ఎమ్మెల్సీ మన్సూర్. కాగా, జాతీయ స్థాయిలో బీజేపీ విధానాలు, ఎజెండాకు కీలకంగా ఉన్న సీటీ రవికి ఉద్వాసన పలకడం వెనుక కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయమే కారణమన్న అభిప్రాయం ఉంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీటీ రవి కూడా మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఇంకా కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గిరిజన నేత లతా ఉసెండీకి పార్టీ ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టారు. జాతీయ కార్యదర్శులుగా నియమితులైన 9 మందిలో ఏడుగురు పాతవారు కాగా, రాధా మోహన్ అగర్వాల్‌ను కొత్తగా తీసుకున్నారు.



## కల్వల ప్రాజెక్టును రీ డిజైన్ చేస్తాం

**వచ్చే వానకాలం కల్లా సరికొత్తగా నిర్మిస్తాం**

**వారం, పది రోజుల్లో నిధులు విడుదల చేస్తాం**

**రైతులు, మత్స్యకారులు ఆందోళన చెందవద్దు**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్ కుమార్**

**సమ సమాజం:** మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి, సతీశ్‌కుమార్‌తో కలిసి ప్రాజెక్టు గండి పరిశీలన 'రైతులు, మత్స్యకారులు ఆందోళన చెందవద్దు. మీ ప్రాంత వరప్రదాయిని అయిన కల్వల ప్రాజెక్టును రీడిజైన్ చేస్తాం. ఇలాంటి ప్రాజెక్టు తెలంగాణలో ఎక్కడా లేదు. అంతగొప్ప జల భాండాగారం ఇది. 55 ఏండ్ల కింద 400 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కల్పతరువు మత్తడికి గండిపడి నీరంతా బయటికి పోవడం బాధాకరం. వెంటనే సీఎం కేసీఆర్‌తో మాట్లాడి వారం, పదిరోజుల్లో నిధులు మంజూరు చేయించి వచ్చే వానకాలం కల్లా ప్రాజెక్టును సరికొత్తగా పునర్నిర్మిస్తాం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి, సతీశ్‌కుమార్‌తో కలిసి ప్రాజెక్టు మత్తడిని పరిశీలించారు. రైతులు, మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. శంకరపట్నం, జూలై 29: కల్వల ప్రాజెక్టును రీ డిజైన్ చేసి సరికొత్తగా పునర్నిర్మిస్తామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ ప్రకటించారు. కల్వల ప్రాజెక్టుకు గండి పడ్డ ప్రాంతాన్ని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, మానకొండూర్, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి శనివారం సందర్శించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించారు. అనంతరం వినోద్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. 400 ఎకరాల విస్తీర్ణంలో 55 ఏండ్ల కింద నిర్మించిన ఈ ప్రాజెక్టు 3500 ఎకరాలకు వరప్రదాయిని అని పేర్కొన్నారు. 1980 తర్వాత ప్రాజెక్టు ఎగువన కాకతీయ కెనాల్ నిర్మించడంతో నిరంతరం జలకళతో కనిపిస్తున్నదని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల వీణవంక మండలంలోని 15 గ్రామాలకు పూర్తిస్థాయిలో, మరో ఐదారు గ్రామాలకు పాక్షికంగా నీరందుతుందని చెప్పారు. దురదృష్టవశాత్తూ మూడు రోజుల పాటు కుండపోత వర్షాలు పడడం వల్ల ప్రాజెక్టుకు గండి పడి, నీరంతా బయటికిపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రాజెక్టు తెలంగాణలో ఎక్కడా లేదన్నారు. మత్తడి దిగువన ఇసుక మేటలతో కూడిన క్యాల్షియం డిపాజిట్స్ చేరడం వల్ల మత్తడికి పగుళ్లు వచ్చినట్లు ఇంజినీర్లు వివరించినట్లు వెల్లడించారు. రైతులు, మత్స్యకారులు ఎవరూ ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. తనతో పాటు మంత్రి గంగుల కమలాకర్, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఈ విషయమై సీఎం కేసీఆర్‌తో కూలంకషంగా చర్చించి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి కృషిచేస్తామని స్పష్టం చేశారు. సత్వరమే ముఖ్యమంత్రితో మాట్లాడి వారం, పది రోజుల్లో నిధులు విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. కల్వల ప్రాజెక్టును పూర్తి రీ డిజైన్ తయారు చేయించి వచ్చే వానకాలం నాటికి ప్రాజెక్టును పటిష్టంగా నిర్మిస్తామని వెల్లడించారు. కాగా, ప్రాజెక్టును త్వరగా పునర్నిర్మించాలని కోరుతూ స్థానిక మత్స్యకారులు, రైతులు వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## రుయ్యాడిలో భక్తజనసందోహం

**తలమడుగు,సమ సమాజం:** రాష్ట్రంలో మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిగాంచిన రుయ్యాడిలో శనివారం సంబురా లు ముగిశాయి. ముగింపు సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హస్సేన్ హుస్సేన్ సవార్లను (పీరీలను) దర్శించుకుని పూజలు చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయని ఇక్కడికి వచ్చే భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం తరలివచ్చి పూజలు చేశారు. చివరి రోజు కావడంతో భక్తులతో హస్సేన్ హుస్సేన్ దేవస్థానం కిటకిటలాడింది. గురువారం రాత్రి నుంచి శనివారం సాయత్రం వరకూ మొహర్రం వేడుకలు నిర్వహించారు. దేవస్థానంలో మాజీ ఎంపీ గోడం నగే?శ్, ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనిషా పవన్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి డప్పువాయిస్తు గ్రామంలో ఊరేగింపులో పాల్గొన్నారు. వివిధ వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.

**భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు...**

మొహర్రం వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హస్సేన్ హుస్సేన్ దేవస్థానం ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్, అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ధనశ్రీ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పార్టీ.. పరువు చేజారె!

**సమ సమాజం:** "ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకునేవాడు ప్రజా ప్రతినిధి". అందుకే ప్రజాప్రతినిధి అనేవాళ్లు ప్రజల మధ్య ఉండాలి. ఎన్నుకున్న జనాన్ని గాలికొదిలేసి గాలి రాజకీయం చేస్తే ఏమౌతుంది? బిల్డప్ బెడిసికొడుతుంది! ఫ్లెక్సీ ఏకంగా చిరిగేపోతుంది!! టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు రేవంత్‌రెడ్డికి ఈ నగ్న సత్యం తాజాగా అర్థమైంది. ఫలితంగా ఉప్పల్ చౌరస్తాలో తన ముందే తన పార్టీ కార్యకర్తలు వర్గాలుగా విడిపోయి పొట్టుపొట్టుగా కొట్టుకోవడమే కాదు! చివరకు తనే ఫ్లెక్సీనే పరా చింపేదాకా పరిస్థితి 'చే'జారి పోయింది. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఏనాడో తన పార్లమెంటును గాలికి వదిలేశారు. 2020లో నగరాన్ని వరదలు ముంచెత్తింది మొదలు మూడు రోజుల కిందటి వరకు కుంభవృష్టి దంచి కొట్టినా తన పార్లమెంటు పరిధిలో జనం ఎలా ఉన్నారని ఒక్క ప్రాంతానికి వచ్చిన దాఖలాలు లేవు. దీంతో కడుపుమండిన ఓటర్లు ఇటీవల 'మల్కాజిగిరి ఎంపీ మిస్సింగ్' అంటూ పోస్టర్లు వేశారు. కారా?నాలోని విక్రంపురి బస్టాపులో పెద్ద ఎత్తున వెలిసిన ఈ పోస్టర్లలో ఓటర్లు తమ ఆవేదన, ఆక్రోశాన్ని వెలిబుచ్చారు. తీరా ఈ విషయం ఈనోటా ఆనోటా.. రేవంతుడికి చేరింది. రాజకీయ నాయకుడు కదా! తన పార్లమెంటు పరిధిలో ఉనికి చాటుకోవాలనుకున్నాడు. ఉప్పల్ నారాపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం నత్త నడకన సాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. భారత్‌మాల పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోనే ఉన్న ఈ ప్రాజెక్టు ఐదేండ్లుగా కొన'సాగుతున్నా'- ఏనాడూ రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన దాఖలాలు లేవు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన సందర్భాలూ లేవు. అయితే, ఈ ప్రాజెక్టు సందర్భంగా ఉప్పల్ నారాపల్లి రహదారి దెబ్బతిన్నది. పైగా కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టు పూర్తయితే తప్ప కేంద్రం ఆ రహదారికి మరమ్మతులు చేసే పరిస్థితి లేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వమే స్పందించి రూ.4 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టేందుకు నిర్ణయించింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 'పరిధి' చూడకుండా పనులు చేపడుతున్నామని మంత్రి కేటీఆర్ కూడా ప్రకటించారు.



# కావ్యను అలా చూస్తే బాధేసేది..

చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత ఒక్కసారిగా ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గురించి ప్రస్తావించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. టీమ్ బాగా ఆడుతున్నప్పుడు ఎంతో ఉత్సాహంతో కనిపించే ఆ ఫ్రాంచైజీ యజమాని కావ్య మారన జట్టు ఓడుతున్నప్పుడు ఎంతో నిరాశకు గురయ్యే హావభావాల వీడియోలు, ఫొటోలు తనను బాధించేవని అన్నారు. పనిలో పనిగా మేటి జట్టును ఎంపిక చేసుకోవాలని సలహా ఇచ్చారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తున్న 'జైలర్' సినిమా ఆడియో విడుదల సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తలైవా మాట్లాడారు. 'ఐపీఎల్‌లో తమ జట్టు వరుస పరాజయాల నేపథ్యంలో నిరాశపడుతున్న కావ్యను టీవీలో చూసి చాలా బాధేసింది. వచ్చే ఏడాదైనా గొప్ప ఆటగాళ్లను ఎంపిక చేసుకొని నాణ్యమైన జట్టుతో బరిలోకి దిగాలని కళానిధి మారన్ (కావ్య తండ్రి)ను కోరుతున్నాన'ని రజనీ అన్నారు.

# ఇంగ్లండ్ దూకుడు



లండన్: ట్రోఫీ చేజారినా..యాషెస్ సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలగా ఉన్న ఇంగ్లండ చివరి టెస్ట్‌లో యమజోరు ప్రదర్శిస్తోంది. కేవలం ఒక రోజులోనే దాదాపు 400 పరుగులు చేయడం ఆతిథ్య జట్టు 'బజ్‌బాల్' దూకుడును తెలియజేస్తుంది. రూట్ (91), బెయిర్ స్టో (78) క్రాలీ (73) ధాటి బ్యాటింగ్‌తో అర్ధ శతకాలు చేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో శనివారం ఆఖరికి ఆ జట్టు తొమ్మిది వికెట్లకు 389 పరుగులు చేసింది. డకెట్ (42), స్టోక్స్ (42), మొయిన్ అలీ (29) కూడా రాణించారు. స్టార్క్ నాలుగు, మర్ఫీ మూడు వికెట్లు పడగొట్టారు. ఇక ఇంగ్లండ్ మొత్తంగా 377 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 283, ఆస్ట్రేలియా 295 పరుగులు సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు 12 పరుగుల లోటుతో ఇంగ్లండ్ మూడోరోజు రెండో ఇన్నింగ్స్ చేపట్టగా..ప్రధాన బ్యాటర్లంతా చెలరేగారు. ఫలితంగా ఓవర్‌కు 4.86 పరుగులతో ఇంగ్లండ్ స్కోరుబోర్డు దూసుకు పోయింది..

# భారత్ తడ'బ్యాటు'



బ్రిడ్జిటౌన్: వెస్టిండీస‌తో రెండో వన్డేలోనూ బ్యాటింగ్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. స్లో పిచ్‌పై పరుగులు సాధించడంలో బ్యాటర్ల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఓపెనర్లు ఇషాన్ (55), గిల్ (34) అందించిన శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. తొలి వికెట్‌కు ఈ జోడీ 90 పరుగులు అందిస్తే.. ఆ తర్వాత మిగతా బ్యాటర్లంతా కలిసి చేసింది 91 పరుగులే కావడం గమనార్హం. దీంతో శనివారం పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు 40.5 ఓవర్లలో 181 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ గుడకేశ్ మోటీ, పేసర్ షెఫర్డ్‌లకు మూడేసి.. జోసెఫకు రెండు వికెట్లు దక్కాయి. ఇక అవిశ్రాంతంగా క్రికెట్ ఆడుతున్న కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్నారు. దీంతో హార్దిక్ సారథ్యంలో జట్టు బరిలోకి దిగగా.. సంజూ శాంసన్, అక్షర్‌లకు చోటు కల్పించారు. అయితే ఆఖరి వన్డేలో రోహిత్, విరాట్ ఆడతారని హార్దిక్ చెప్పాడు.

**ఓపెనర్లు రాణించినా..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ఇషాన్, గిల్ ఈసారి శుభారంభం అందించారు. అయితే టర్న్, బౌన్స్‌ను సద్వినియోగం చేసుకున్న స్పిన్నర్ మోటీ, పేసర్ షెఫర్డ్‌ల ధాటికి మిగతా బ్యాటర్లు దారుణంగా తడబడ్డారు. అటు విండీస్ ఫీల్డింగ్‌లోనూ ఆకట్టుకోవడం విశేషం. ఆరంభంలో ప్రత్యర్థి బౌలర్లను యువ ఓపెనర్లు దీటుగా ఎదుర్కొన్నారు. అడపాదడపా బౌండరీలతో జట్టుకు భారీ స్కోరు ఖాయమనేలా వీరి ఆటతీరు సాగింది. ఈక్రమంలో ఇషాన్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ మెరిశాడు. అటు టెస్టు సిరీసతో పాటు తొలి వన్డేలో విఫలమైన గిల్ జాగ్రత్తగా ఆడుతూ క్రీజులో పాతుకుపోయాడు.

నాలుగో ఓవర్‌లో తను రెండు ఫోర్లతో ఆకట్టుకోగా.. ఇషాన్ సైతం 8వ ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదాడు. 34 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాన్ క్యాచ్‌ను మోటీ వదిలేశాడు. అయితే చక్కగా కుదురుకున్న ఈ జోడీకి వరుస ఓవర్లలో షాక్ తగిలింది. 17వ ఓవర్‌లో గిల్‌ను స్పిన్నర్ మోటీ అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లో బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో అథనజె డైవింగ్ క్యాచ్‌తో ఇషాన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఈ వికెట్ షెఫర్డ్ తీశాడు. అనంతరం భారత్ తడబాటు కూడా ఆరంభమైంది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన సంజూ శాంసన్ (9), అక్షర్ (1) వెంటవెంటనే అవుటయ్యారు. మధ్యలో వర్షం కారణంగా అర్ధగంట మ్యాచ్ ఆగింది. ఆ తర్వాత కూడా వికెట్ బ్యాటింగ్‌కు సహకరించకపోవడంతో పరుగులు కూడా నెమ్మదించాయి. దీనికి తోడు వరుస ఓవర్లలో జడేజా (10), సూర్యకుమార్ (24) వెనుదిరిగారు. శార్దూల్ (16) వేగంగా ఆడాలని చూసినా కాసేపే అయ్యింది. చివరి ఐదు వికెట్లు జట్టు 68 పరుగుల తేడాలోనే కోల్పోయింది.

**స్కోరుబోర్డు**

**భారత్:** ఇషాన్ (సి) అథనజె (బి) షెఫర్డ్ 55, గిల్ (సి) జోసెఫ్ (బి) మోటీ 34, సంజూ (సి) కింగ్ (బి) కారియా 9, అక్షర్ (సి) హోప్ (బి) షెఫర్డ్ 1, హార్దిక్ (సి) కింగ్ (బి) సీల్స్ 7, సూర్యకుమార్ (సి) అథనజె (బి) మోటీ 24, జడేజా (సి) కారియా (బి) షెఫర్డ్ 10, శార్దూల్ (ఎల్బీ) జోసెఫ్ 16, కుల్దీప్ (నాటౌట్) 8, ఉమ్రాన్ (సి) కార్టీ (సి) జోసెఫ్ 0, ముఖేష్ (సి) హెట్‌మయెర్ (బి) మోటీ 6, ఎక్స్‌ట్రాలు 11, మొత్తం: 40.5 ఓవర్లలో 181 ఆలౌట్‌బీ వికెట్ల పతనం : 1-90, 2-95, 3-97, 4-113, 5-113, 6-146, 7-148, 8-167, 9-167బీ బౌలింగ్: మేయర్స్ 5-0-18-0, సీల్స్ 6-0-28-1, జోసెఫ్ 7-0-35-2, గుడకేశ్ మోటీ 9.5-0-36-3, షెఫర్డ్ 8-1-37-3, యానిక్ కారియా 5-0-25-1.




# ఆలోచించుకుని ఓటేయ్యండి



ఎవరి వల్ల పరిశ్రమకు ఉపయోగం ఉంటుందో, ఏ ప్యానెల్ వల్ల మంచి జరుగుతుందో బాగా ఆలోచించుకుని ఓటేయ్యండి' అని విజ్ఞప్తి చేశారు దిల్ రాజు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తన ప్యానెల్ సభ్యులతో కలసి శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో దిల్ రాజు మాట్లాడుతూ 'పరిశ్రమ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం నేను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. అయితే ఈ పోటీలో ఎలాంటి వివాదాలు లేవు. ఫిల్మ్ ఛాంబర్‌ను బలోపేతం చేసేందుకే మేం ముందుకు వచ్చాం. పరిశ్రమలో నాలుగు సెక్టార్లకు ఫిల్మ్ ఛాంబరే సుప్రీం. ప్రతి విభాగంలో సమస్యలు ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం కృషి చేయాలి. ఎగ్జిబిటర్స్ కు ప్రభుత్వాలతో కొన్ని సమస్యలు ఉన్నాయి. పరిష్కరించడానికి టైమ్ కావాలి. వాటి కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. కొవిడ్ తర్వాత సినీ పరిశ్రమలో చాలా మార్పులు వచ్చాయి. తెలుగు సినిమా ఇప్పుడు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఆ గుర్తింపును మరింత ముందుకు కొనసాగించాలి. 1600 మంది సభ్యులు ఉన్నా రెగ్యులర్‌గా సినిమా తీసేవాళ్లు 200 మంది మాత్రమే. ప్రస్తుతం ఫామ్‌లో ఉన్న నిర్మాతలందరూ మా ప్యానెల్‌లో ఉన్నారు. దిల్ రాజు ప్యానెల్ యాక్టివ్ ప్యానల్. ఫిల్మ్ ఛాంబర్‌లో సరైన వ్యక్తులు ఉంటేనే న్యాయం జరుగుతుంది' అని అన్నారు. ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైనా తనకు కిరీటం పెట్టరనీ, కొత్త సమస్యలు తనకు వచ్చినట్లేనని దిల్ రాజు వ్యాఖ్యానించారు. అయినా తన తొలి ప్రాధాన్యం ఫిల్మ్ ఛాంబర్‌కే ననీ, ఏడాది కాలంలో మార్పులు చేసి, తర్వాత వచ్చే వారికి అప్పగిస్తానని ఆయన చెప్పారు. పరిశ్రమలో ఓటు రాజకీయం ఉందనీ, అభిషేక్ నామా, పంపిణీదారుడు సత్యనారాయణ తమ ప్యానెల్‌లో ఉన్నా వారి ఫొటోలను అవతలి ప్యానెల్ వారు ఉపయోగించుకుని ప్రచారం చేస్తున్నారని దిల్ రాజు ఆరోపించారు.

# దుల్కర్ హీరో.. రానా నిర్మాత

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా ఓ కొత్త చిత్రం ఖరారైంది. 'కాంత' అనే టైటిల్ ఖరారు చేశారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తారు. ప్రముఖ కథానాయకుడు రానా ఈ చిత్ర నిర్మాణంలో భాగం పంచుకోవడం విశేషం. రానా స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫేరన్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు సందర్భంగా ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ని విడుదల చేశారు. "మంచి సినిమా శక్తిని గుర్తు చేసే కథ మనకు అరుదుగా కనిపిస్తుంది. 'కాంత' మమ్మల్ని ఓచోట చేర్చింది. దుల్కర్ లాంటి ప్రతిభావంతుడితో ఈ ప్రయాణాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది" అని రానా పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.




# సరికొత్త కథతో.. శేఖర్ కమ్ముల

శేఖర్ కమ్ముల కథలన్నీ హృద్యంగా ఉంటాయి. సున్నితమైన భావాల్ని ఒడిసి పట్టుకొంటారాయన. అయితే ఇప్పటి వరకూ ఆయన టచ్ చేయని జోనర్‌లో ఓ సినిమా చేస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మాతలు. శుక్రవారం ధనుష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రబృందం కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. నాగార్జున ఓ కీలక పాత్రలో నటిస్తారని ప్రచారం జరుగుతోంది. రెహమాన్ స్వరాలు సమకూరుస్తారని, రష్మిక కథానాయికగా నటించనుందని సమాచారం. అయితే ఈ విషయమై చిత్రబృందం అధికారికంగా స్పందించాల్సివుంది.



# 'బిగ్ బుల్' వచ్చేశాడు

రామ్ - పూరి జగన్నాథ్ కాంబోలో రూపొందిన 'ఇస్మార్ట్ శంకర్' ఎంత పెద్ద విజయాన్ని అందుకొందో ప్రత్యేకంగా గుర్తు చేయాల్సిన పనిలేదు. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. 'ఇస్మార్ట్..' కంటే పెద్ద స్థాయిలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాలన్నది పూరి ఆలోచన. అందుకే మరింతమంది స్టార్స్‌ని ఈ చిత్రం కోసం రంగంలోకి దింపుతున్నారు. అందులో భాగంగా ప్రతినాయకుడిగా సంజయ్ దత్‌ని ఎంచుకొన్నారు. 'బిగ్ బుల్' పాత్రలో సంజయ్ దత్‌ని పరిచయం చేస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ని విడుదల చేసింది. సంజయ్‌దత్ రాకతో.. ఈ చిత్రంపై మరిన్ని అంచనాలు పెరిగాయి. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 8న విడుదల చేస్తారు. నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in